క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ : నల్లగొండ పట్టణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల కారణంగా మంగళవారం పట్టణంలోని పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు హైదరాబాద్ రోడ్డు శివాజీనగర్, ఎన్జీ కాలనీ, క్లాక్‌టవర్, రామగిరి, కనకదుర్గ స్ట్రీట్, శ్రీనివాస్‌నగర్, సావర్కర్‌నగర్, గాంధీనగర్, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

రేపు విద్యాసంస్థల బంద్

నకిరేకల్ : విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈ నెల 12న చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ ఇన్‌చార్జ్ అంబటి చిరంజీవి, మండల కార్యదర్శి రవీందర్ కోరారు. విద్యా సంస్థల యాజమాన్యాలు సహకరించాలని కోరారు.

బంద్‌కు పీడీఎస్‌యూ మద్దతు

నల్లగొండ టౌన్ : విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 12న రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన విద్యా సంస్థల బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లగిరి కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

'కృష్ణవేణి' విద్యార్థుల ప్రతిభ

చిట్యాల : పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ఎక్స్‌ప్లోర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ది నాలెడ్జ్ ఒలింపియాడ్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆ స్కూల్ కరస్పాండెంట్ శ్రీధర్, ప్రిన్సిపాల్ బొడ్డు యాదగిరిగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్థిని కె.అక్షిత, తొమ్మిదో తరగతి విద్యార్థిని పొట్లపల్లి దీక్షిత, ఎనిమిదో తరగతి విద్యార్థి కొత్తకొండ రోహిత్‌లు జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతులు గెలుపొందారని పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కనగల్ : మండల పరిధిలోని దర్వేశిపురం గ్రామానికి చెందిన నరాల చంద్రయ్య ఆకస్మికంగా మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి రూ.10 వేల ఆర్థికసాయాన్ని ఎంపీపీ కరీంపాష ద్వారా సోమవారం అందజేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వంగాల సహదేవరెడ్డి, సర్పంచ్ అల్లుబెల్లి పూలమ్మ, అల్లుబెల్లి నర్సింహారెడ్డి, ఎంపీటీసీ నకిరేకంటి శైలజసైదులు, ఉప సర్పంచ్ జినుకుంట్ల అంజయ్య ఉన్నారు.

బీసీల రాజకీయ ప్లీనరీని విజయవంతం చేయాలి

కనగల్ : ఈ నెల 15న హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగే బీసీల రాజకీయ ప్లీనరీని విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరెకంటి నాగరాజుగౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కనగల్ : మండల పరిధిలోని శేరి లింగోటం వాగు నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేసిన రెండు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి సోమవారం తెలిపారు. పోలీసులను చూసి ట్రాక్టర్ డ్రైవర్లు పారిపోయారని అన్నారు.

బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శిగా బొల్లం సైదులు



మునుగోడు : బీసీ సంక్షేమ సంఘం మండల కార్యదర్శిగా గుండ్లోరిగూడెం గ్రామానికి చెందిన బొల్లం సైదులు నియమితులయ్యారు. సోమవారం సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మునుగోడులో సైదులుకు నియామక పత్రం అందచేశారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, నియోజకవర్గ అధ్యక్షుడు బూడిద లింగయ్య యాదవ్, మండల అధ్యక్షుడు గుంటోజు వెంకటాచారిలకు కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టరేట్‌లో వినతి

నకిరేకల్ : మండలంలోని తాటికల్ గ్రామంలో హైవే రోడ్డు నిర్మించే క్రమంలో జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లే దారిని ధ్వంసం చేశారని, ఆ దారిని పునరుద్ధరించాలని కోరుతూ బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి చెనగాని రాములు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చెనగాని సైదులు, రమేష్ ఉన్నారు.

వేధింపులు ఆపాలి

నల్లగొండ టౌన్ : వీఓఏలపై ఏపీఎం, సీసీల వేధింపులు ఆపకపోతే తగిన గుణపాఠం తప్పదని తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ హెచ్చరించారు. సోమవారం స్థానిక దొడ్డి కొమురయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు కె.శరత్‌కుమార్, చిలుముల దుర్గయ్య, ఎస్‌కె సైదాబేగం, ఎం.జంగయ్య, జె.లలిత, కెస్‌కె ఫర్హాన, జి.సువర్ణ, ఎం.మంగమ్మ, ఎం.అహల్య, యాదగిరి, లక్ష్మి, సైదమ్మ, అజయ్, మమత, అంజయ్య పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు షురూ..

- చండూరులో 2.5 కిలోమీటర్లు ప్రధాన రోడ్డు విస్తరణ
- రూ.30 కోట్ల నిధులు మంజూరు



రోడ్డు విస్తరణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి(ఫైల్)



చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

చండూరు : మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు విస్తరణ పనులు మొదలయ్యాయి. పనులు పూర్తయితే ఇక చండూరు రూపురేఖలు మారనున్నాయి. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి చండూరు మున్సిపాలిటీ రోడ్డు విస్తరణ చేపడతామనే హామీ మేరకు రూ.30 కోట్ల నిధులను విడుదల చేశారు. టెండర్ ప్రక్రియ సైతం ముగియడంతో గత బుధవారం మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పనులను ప్రారంభించారు. ఇప్పటికే మున్సిపల్ అధికారులు రోడ్డు కొలతలు వేశారు. రోడ్డుకు ఇరువైపులా 50 ఫీట్ల చొప్పున 100 ఫీట్ల రోడ్డుగా వెడల్పు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. విస్తరణలో భాగంగా వారం రోజులుగా రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లను తొలగిస్తున్నారు. పెద్దపెద్ద చెట్లను తొలగించేందుకు అటవీ శాఖ నుంచి అనుమతి కోరారు. అనుమతులు రాగానే పెద్ద చెట్లను తొలగించనున్నారు.

రూ.30 కోట్లు.. 2.5 కిలోమీటర్లు

చండూరు మున్సిపాలిటీ పరిధిలో రూ.30 కోట్ల నిధులతో 2.5 కిలోమీటర్ల మేరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. చండూరులో అంగడిపేట పెట్రోల్ బంక్ నుంచి నల్లగొండ రోడ్డు పెట్రోల్ బంక్ వరకు రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. సెంట్రల్ లైటింగ్, ఇరువైపులా డ్రెయినేజీ, మధ్యలో పూల మొక్కలు, ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేయనున్నారు. ముందుగా డ్రెయినేజీ, కల్వర్టులను పూర్తిచేసి, సీసీ రోడ్డుతో పాటుగా ఇతర పనులను మొదలు పెట్టనున్నారు.

ఎమ్మెల్యేకు వినతులు

చండూరు మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు విస్తరణపై పట్టణ ప్రజలకు స్పష్టత లేకపోవడంతో అయోమయంలో పడ్డారు. అధికారులు ప్రభుత్వం నిబంధనల మేరకు విస్తరణ చేస్తామని చెబుతున్నారు. కొంతమంది స్థానిక నాయకులు రోడ్డు విస్తరణను సవరించాలని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని కోరుతూ వస్తున్నారు. అధికారులు మాత్రం రోడ్డును 100 ఫీట్లు (ఇరువైపులా 50 ఫీట్లు) వరకు విస్తరిస్తామని చెబుతున్నారు.

ప్రజలు సహకరించాలి



చండూరు పట్టణంలో రోడ్డు విస్తరణ పనులను అభివృద్ధిలో భాగంగానే చేపడుతున్నాం. రోడ్డు వెడల్పు పనులకు నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు. చండూరు పట్టణం ఏడాదిలో అందంగా తయారు కానుంది. రోడ్డు వెడల్పు పనులకు పట్టణ ప్రజలు సహకరించాలి.

– తోకల చంద్రకళ, మున్సిపల్ చైర్‌పర్సన్

ముందుగా డ్రెయినేజీ పనులు చేపడతాం



రోడ్డు విస్తరణకు పట్టణ ప్రజల సహకారం ఉండాలి. విస్తరణ పనుల్లో భాగంగా చిన్నచిన్న చెట్ల తొలగింపు ప్రక్రియ మొదలైంది. అధికారుల అనుమతి రాగానే పెద్ద చెట్ల తొలగింపు ఉంటుంది. ముందుగా డ్రెయినేజీ పనులు చేపడతాం. ప్రభుత్వం జారీ చేసిన జీఓ మేరకు రోడ్డు విస్తరణ విస్తరణ పనులు చేపడతాం.

– నాగ ప్రసాద్, ఏఈ

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. సర్పంచ్‌లకు ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాలపై సోమవారం నల్లగొండ పట్టణం వీటీ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో నల్లగొండ, కనగల్ మండలాలకు చెందిన ఎంపీటీసీలకు, సర్పంచ్‌లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా పేద ప్రజల అభ్యున్నతికి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేసిందన్నారు. దళిత బంధు, గృహలక్ష్మి, గొర్రెల పెంపకం, కులవృత్తుల వారికి లక్ష రూపాయల సహాయం తదితర సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ సమావేశంలో కనగల్ ఎంపీపీ కరీంపాషా, కనగల్, జి. ఎడవెల్లి సింగిల్ విండో చైర్మన్లు వంగాల సహదేవరెడ్డి, దోటి శ్రీనివాస్, నల్లగొండ, కనగల్ మండలాల పార్టీ అధ్యక్షులు దేప వెంకట్‌రెడ్డి, అయితగోని యాదయ్య, నాయకులు బకరం వెంకన్న, సంకు ధనలక్ష్మి, సర్పంచ్‌లు కడారి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట గీత కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న గీత కార్మికులు

నల్లగొండ టౌన్ : బీసీ కులవృత్తుల వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని గీత కార్మికులందరికీ ఇవ్వాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చొగాని సీతారాములు, జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. గీత కార్మిక వృత్తి చేసుకునే కార్మికులకు సేఫ్టీ మోకులు ఇవ్వాలని, సభ్యులందరికీ ద్విచక్ర వాహనాలు ఇవ్వాలన్నారు. జీవిత బీమా, హెల్త్ పాలసీ అమలు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా నీరా కేంద్రాలను విస్తరించాలని డిమాండ్ చేశారు. గౌడ నిరుద్యోగ యువతీయువకులకు ఓనర్‌కమ్ డ్రైవర్లుగా టాక్సీ కార్లు కొనివ్వాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పామనగుండ్ల అచ్చాలు, వేములకొండ పుల్లయ్య, ఉప్పల గోపాలు, కొప్పు అంజయ్య, రాచకొండ వెంకట్‌గౌడ్, మక్తాల లింగస్వామి, జేరిపోతుల ధనంజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె



కేతేపల్లి : ధర్నా చేస్తున్న కార్మికులు

రామగిరి(నల్లగొండ): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ తిప్పర్తి మండల కన్వీనర్ భీమగాని గణేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తిప్పర్తి మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు టోకెన్ సమ్మె నిర్వహించారు. కార్మికులకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని, కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు పోలగోని యాదమ్మ, కిన్నెర సైదమ్మ, సిరసవాడ ఉమా, వెంకటమ్మ, రూతమ్మ, పద్మ, రేణుక, నర్సమ్మ, పిచ్చమ్మ, జ్యోతి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం లేక విద్యార్థుల పస్తులు

జిల్లావ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికుల టోకెన్ సమ్మె సోమవారం ప్రారంభమైంది. దీంతో తిప్పర్తి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం నిలిచిపోయింది. బకాయిలు చెల్లిస్తేనే వంట చేస్తామని కార్మికులు భీష్మించడం, అధికారులు పట్టించుకోపోవడంతో పిల్లలు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. తిప్పర్తి మండలంలో 6 ఉన్నత పాఠశాలల్లో 875 మంది, 5 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 516 మంది, 32 ప్రాథమిక పాఠశాలల్లో 893 మంది విద్యార్థులు ఉన్నారు. కొంతమంది పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ముందుగా సమాచారం ఇవ్వడంతో విద్యార్థులు ఇంటి నుంచి లంచ్ బాక్సు తెచ్చుకున్నారు. సమాచారం తెలియని కొందరు విద్యార్థులు సోమవారం మధ్యాహ్నం పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కేతేపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న భోజన కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కేతేపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ ఆదిమళ్ళ సుధీర్ మాట్లాడుతూ వంట కార్మికులకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో అప్పులు చేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెడుతున్నారని అన్నారు. కార్మికులకు ప్రభుత్వం పెంచిన వేతనాలను వెంటనే అమలు చేయాలన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచడంతోపాటు పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ లక్ష్మారెడ్డికి అందజేశారు. వంట కార్మికులు కోనేటి ముత్తమ్మ, బొజ్జ ఎల్లమ్మ, సునీత, స్వరాజ్యం, సుగుణమ్మ, నాగమ్మ, లింగమ్మ పాల్గొన్నారు.

మునుగోడు : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు నెలకు రూ.19,500 వేతనం ఇవ్వాలని సీఐటీయూ మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మునుగోడు అంబేద్కర్ చౌరస్తాలో ఏజెన్సీ నిర్వాహకులు నిరసన దీక్ష చేపట్టారు. దీక్షకు సీఐటీయూ ఆధ్వర్యంలో మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ముత్యాలు మాట్లాడుతూ ఏజెన్సీ నిర్వాహకులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ సంఘం మండల అధ్యక్షురాలు నీరుడు రాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షురాలు బోయపర్తి అంజమ్మ, సత్తమ్మ, బొల్గూరి ధనమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మర్రిగూడ : మండలంలోని సరంపేట గ్రామానికి చెందిన చిర్రపు శ్రీకాంత్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. శ్రీకాంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ.1.40 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కును సోమవారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. సంగెపు గిరినేత, వెన్నమల్ల నరసింహ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

నల్లగొండ టౌన్ : టైలరింగ్ కార్మికుల సంఘం మాజీ అధ్యక్షుడు రామదాసు వెంకటేశ్వర్లు మరణం కార్మిక వర్గానికి తీరని లోటని, ఆయన స్ఫూర్తితో కార్మికులు హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక దొడ్డి కొమురయ్య భవన్‌లో వెంకటేశ్వర్లు సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సయ్యద్ హాషం, ఎండీ సలీం, దండెంపల్లి సత్తయ్య, రాపర్తి లక్ష్మీనారాయణ, తాడూరి సంతోష్, గుంటి యాదగిరి, మునగాల శంకర్, కొండ అంజిబాబు, గుంటి మనోహర్, సైదులు, అంజయ్య, పాషా, రాము, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ రైతు బీమా అందేలా చూడాలి



రైతు బీమా నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ

రామగిరి(నల్లగొండ) : అర్హులందరికీ రైతు బీమా అందేలా మండల వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏడీఏ శ్రవణ్‌కుమార్ అన్నారు. సోమవారం తిప్పర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో క్లస్టర్ స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని రైతు బీమా నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీమా పథకానికి 2023–24 సంవత్సరానికి 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులన్నారు. ఆగస్టు 5వ తేదీ వరకు సంబంధిత ఏఈఓ వద్ద దరఖాస్తు చేసుకోవాలని రైతులను కోరారు. అదేవిధంగా పంటలు ప్రారంభమైనందున ఆన్‌లైన్‌లో పంట వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సన్నీరాజ్, ఏఈఓలు లక్ష్మీనారాయణ, గోపి, రజిత, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మర్రిగూడ : జూన్ 18 వరకు పట్టా పాస్ పుస్తకం పొంది 18–59 సంవత్సరాల వయస్సు కలిగిన రైతులందరు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆవుల స్వందన అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడారు. గతంలో రైతు బీమా చేయించుకున్న రైతులు ఆధార్ కార్డులో ఏమైనా మార్పులు ఉన్నా, నామినిని మార్చుకోవానుకుంటున్నా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతు బీమా దరఖాస్తు ఫారంతోపాటు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు జీరాక్స్ కాపీలను రైతులు స్వయంగా వచ్చి రైతు వేదికల్లో ఏఈఓలకు అందజేయాలన్నారు. ఆమె వెంట ఏఈఓలు శ్రీలత, రాధిక, సంతోష, పావని, ఉమా, సుజాతలు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె



తిప్పర్తిలో సమ్మెచేస్తున్న కార్మికులు



మునుగోడు : ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



నకిరేకల్ : మద్దతు తెలుపుతున్న వేదాసు శ్రీధర్

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం ఐదో రోజుకు చేరుకుంది. సమ్మెకు సీపీఎం తిప్పర్తి మండల కార్యదర్శి మన్నెం భిక్షం, ఆకిటి లింగయ్య మద్దతు తెలిపారు. సీఐటీయూ తిప్పర్తి మండల కన్వీనర్ భీమగాని గణేశ్, గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కంచర్ల జానయ్య, పాలడుగు చంద్రయ్య, వల్లమ్మ, వెంకటమ్మ, పద్మ, పి.చంద్రయ్య, వెంకన్న, పరమేష్, మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కనగల్ : పంచాయతీ కార్మికుల సమ్మె సోమవారం కొనసాగింది. సంఘం మండలాధ్యక్షుడు జిల్లా విజయ్, కొంగల నర్సింహ, పాండు, యాదయ్య, శంకర్, మంజుల, వాజీద్, కిరణ్, నగేష్, రాములు, రవి, మధు తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ : నకిరేకల్‌లో గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు వేదాసు శ్రీధర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులకు రూ.10 వేల సహాయం అందజేశారు. 4వ వార్డు కౌన్సిలర్ గాజుల సుకన్యశ్రీనివాస్, నాయకులు గండ జలంధర్‌రెడ్డి, గునగంటి రాజు, శరత్‌చంద్రా, విజయ్, కొత్తపల్లి సైదులు, జ్యోతిబసు, శివ, చారి నవీన్, నాగరాజు పాల్గొన్నారు.

మునుగోడు : సమ్మెలో భాగంగా పంచాయతీ కార్మికులు సోమవారం 5వ రోజు మునుగోడులో డప్పుచప్పుళ్లతో నిరసన ర్యాలీ చేపట్టారు. రెడ్డిమల్ల యాదగిరి, పందుల నర్సింహ, మల్లమ్మ, లక్ష్మమ్మ, రాజు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె 5వ రోజుకు చేరుకుంది. సమ్మెకు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య మద్దతు తెలిపారు. వట్టిపల్లి హనుమంతు, ఊరిపక్క లింగయ్య, మంజుల, రాములు, రమేష్, ముత్తమ్మ, సునీత, పద్మ, పోచమ్మ, నర్సింహ, శ్రీను, యాదమ్మ, రాములమ్మ, మహేష్ పాల్గొన్నారు.

యాదవ సంఘం జిల్లా కార్యదర్శిగా సైదులు యాదవ్

నల్లగొండ టూటౌన్ : యాదవ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామానికి చెందిన కొమ్మరబోయిన సైదులు యాదవ్‌ను నియమిస్తూ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల యాదయ్య యాదవ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సైదులు యాదవ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించి జిల్లా అధ్యక్షుడు మేకల యాదయ్యయాదవ్, అల్లి వేణుయాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పోరాటాలకు శ్రీకారం చుట్టాలి



మాట్లాడుతున్న ఆజాద్

నకిరేకల్ : ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలకు నిరసనగా పోరాటాలకు శ్రీకారం చుట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ పిలుపునిచ్చారు. నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం జరిగిన పీడీఎస్‌యూ జిల్లా స్థాయి సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలకు అనుబంధ వసతి గృహాలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా మహేష్, సభ్యులుగా అనిల్, జస్వంతం, కూతాటి మహేష్, బాలు, రాకేష్‌లు ఎన్నికయ్యారు.

విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం



ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతూనే, మరోవైపు విద్యార్థుల్లో జాతీయ వాదాన్ని నింపుతున్నామని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆవుల సంపత్, నగర కార్యదర్శి హేమంత్ అన్నారు. జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నల్లగొండ పట్టణంలోని వివేకానంద విగ్రహం వద్ద ఏబీవీపీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏబీవీపీ 75 సంవత్సరాలుగా విద్యార్థులను జాతీయవాద సిద్ధాంతం వైపు నడిపిస్తూ దేశం కోసం పనిచేసేలా కృషి చేస్తోందన్నారు. అంతకు ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జయేందర్, నాంపల్లి మధు, రవితేజ, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

6వ రోజుకు చేరిన రిలే దీక్ష

మర్రిగూడ : మండల కేంద్రంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో తరుగు పేరుతో అధిక కోతలు విధించారని రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారానికి 6వ రోజు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ అధిక కోతలు విధించి తమను అన్యాయం చేశారని, తమకు న్యాయం చేయాలని అధికారుల చుటట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



కూలేందుకు సిద్ధంగా ఉన్న స్తంభం

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి మండలం మామిడాల సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. పూర్తిగా శిథిలమై విరిగిపోయే స్థితిలో ఉంది. సబ్ స్టేషన్ నుంచి వ్యవసాయ బావులకు వెళ్లే విద్యుత్ లైన్‌లో శ్మశానవాటిక వద్ద స్తంభానికి సిమెంట్ ఊడిపోయింది. దీంతో విద్యుత్ తీగలు లూజ్ అయ్యి మనిషికి అందే ఎత్తులో వేలాడుతున్నాయి విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ఇళ్ల పట్టాలు ఇప్పించాలని ధర్నా



ధర్నా చేస్తున్న గ్రామస్తులు

నల్లగొండ టౌన్ : ఇళ్ల పట్టాలు ఇప్పించాలని కోరుతూ సోమవారం చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సర్వే నంబర్ 711, 717, 718 లో 16 ఎకరాలను ప్రభుత్వం కొనుగోలు చేసి అందులో 425 ఇళ్ల ప్లాట్లు చేసి 12 మందికి మాత్రమే పట్టాలు ఇచ్చారన్నారు. మిగిలిన వారందరికీ పట్టాలు ఇచ్చేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి.భాస్కర్‌రెడ్డి, శ్రీను, ఆర్.లింగస్వామి, బి.రవీందర్, ఎం.సతీష్, మహమూద్, లింగస్వామి, ఇందిరమ్మ, వెంకన్న, పెంటయ్య, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ అందజేత



క్రికెట్ కిట్ అందజేస్తున్న నాయకులు

చిట్యాల : కంచర్ల వెంకట్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కంచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నకాపర్తి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోయపల్లి వెంకన్నగౌడ్ సోమవారం క్రికెట్ కిట్ అందజేశారు. వార్డు సభ్యుడు మామిడి నాగేష్, కంచర్ల ఫౌండేషన్ చైర్మన్ మామిడి ప్రశాంత్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ రుద్రారపు శ్రీను, బాజ నర్సింహ, కొండ శేఖర్, రుద్రారపు లక్ష్మయ్య, షరీఫ్, చొల్లేటి సతీష్, ఉమర్ పాల్గొన్నారు.

సీపీఎం మండల కమిటీ సభ్యుడు మృతి

కట్టంగూర్ : మండలంలోని ఇస్మాయిల్‌పల్లి గ్రామానికి చెందిన సీపీఎం మండల కమిటీ సభ్యుడు చిలుకూరి నర్సింహ(54) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి సోమవారం గ్రామంలో నర్సింహ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ తరుపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు పెంజర్ల సైదులు, ఇటుకల సురేందర్, చిలుముల రామస్వామి, రవీంద్రాచారి, మాద సైదులు, యాదయ్య, శ్రీనివాస్, రామకృష్ణ, ప్రవీణ్ సీపీఎం నాయకులు, వివిధ సంఘాల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చండూరులో జాబ్‌మేళా

చండూరు : స్థానిక డాన్ బాస్కో జూనియర్ కళాశాలలో ఐసీఐసీఐ బ్యాంకు రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టులకు డిగ్రీ పూర్తి చేసిన (25 సంవత్సరాల లోపు) అభ్యర్థులకు టీవీఎస్ ట్రెనింగ్, సర్వీసెస్ కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటీవ్ గోపాలకృష్ణ సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో 8 మంది అర్హత సాధించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ బాలశౌరి తదితరులు ఉన్నారు.

ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు

కనగల్ : ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ అంతిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని శేరిలింగోటం గ్రామంలో ఇసుక ట్రాక్టర్ల ఓనర్లు, డ్రైవర్లతో ఆయన మాట్లాడారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. వాహనాలు నడిపే వారు డ్రైవింగ్ లైసెన్స్ తప్పక కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా గ్రామంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయకపోవడంతో ఎస్‌ఐ పరిశీలించారు. రిపేర్ చేసేందుకు గ్రామస్తులు తగిన సహకారం అందించాలన్నారు. ఆయన వెంట సిబ్బంది వాహీద్, సైదులు, దస్తగిరి ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ అంతిరెడ్డి